ఆది వారం
14-01-2024
సంపుటి - 09,
సంచిక - 431
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra
Pradhesh
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
జాతీయ తెలుగు వార్త పత్రిక
❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## విజయవాడ హైవేపై భారీ రద్దీ

### సొంతూళ్లకు బయలుదేరిన వందలాది వాహనాలు



**ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల పడిగాపులు ● వరుసగా రెండోరోజూ తప్పని ట్రాఫిక్ చిక్కులు**

**హైదరాబాద్, జనవరి 13 (సమ సమాజం):** విజయవాడ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. సంక్రాంతి పండక్కి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో జాతీయ రహదారులపై వాహనాల రద్దీ పెరిగింది. తెలంగాణ కంటే..ఆంధ్రప్రదేశ్ లో సంక్రాంతి పండగ భారీ స్థాయిలో జరుపుకుంటారు. ఎక్కడున్న కుటుంబ సభ్యులు అందరూ.. ఈ పండక్కి కలుసుకుని ఘనంగా జరుపుకుంటారు. పండక్కి వచ్చే జనాలతో ఏపీ గ్రామాలు కలకళలాడుతాయి. హైదరాబాద్ లో ఏపీ ప్రజలు పెద్ద సంఖ్యలోనే ఉంటారు. దీంతో పండక్కి సొంతూరుకు బయల్దేరి వెళ్తున్నారు. వరుసగా శుక్ర,శనివారాల్లోనూ నగరం నుంచి ఏపీకి వెళ్లే వాహనాలతో హైవేలపై వాహనాల రద్దీ నెలకొంది. దీంతో టోల్‌గేట్ల వద్ద పెద్ద ఎత్తున వాహనాలు బారులు తీరడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సంక్రాంతి పండగ సెలవులు కావడంతో ప్రజలు సొంతవూర్లకు పయనమవుతుండడంతో హైదరాబాద్ ఖాళీ అవుతోంది.సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భాగ్యనగరం నుంచి గ్రామాలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివెళ్లడంతో ఎక్కడికక్కడ పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తాయి. దీనికితోడు ఉదయం నుంచి కురుస్తున్న వర్షం కారణంగా వాహనదారులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ లోని పలు ప్రాంతాలకు వేల సంఖ్యలో వెళ్తున్న వాహనాలతో రద్దీ వాతావరణం కనిపిస్తోంది. దీంతో హైదరాబాద్-విజయవాడ హైవేపై నల్గొండజిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ దగ్గర వరుసగా మూడ్రోజులుగా భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనాలు టోల్ ప్లాజాల వద్ద ఆగడంతో రద్దీ చాలా పెరిగిపోతుందని వాహనదారులు చెబుతున్నారు. ఒకవైపు సొంత వాహనాలున్న వారు, మరోవైపు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో ఆంధ్ర ప్రాంతాలకు వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉంది. శనివారం మకర సంక్రాంతిని కుటుంబసభ్యులతో జరుపుకోవాలని ఇళ్లకు పయనమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఓవైపు నగరం 4వ పేజీలో...

## తెలంగాణ పందెం కోళ్లకు గిరాకీ

### ఆంధ్రాలో అమ్మకంతో లాభాలు



**ఖమ్మం, జనవరి 13 (సమ సమాజం):** సంక్రాంతి బరిలో తెలంగాణ కోళ్లు హల్‌చల్ చేస్తున్నాయి. ఇక్కడి కోళ్లకు గిరాకీ ఉండడంతో కోళ్లను పెంచిన వారు దండిగా సంపాదిస్తున్నారు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి పందెంకోళ్లను కొనుక్కుని పోతున్నారు. అనేక కుటుంబాల వారు సుమారు 30 ఏళ్ల నుంచి ఇక్కడ పందెం కోళ్లను పెంచుతున్నారు. గతంలో స్థానికులు ఇక్కడ పందేలు ఆడేవారని, పోలీసుల దాడులు పెరగడంతోపాటు ఆర్థికంగా నష్టపోతుండడంతో వాటిని పక్కనపెట్టేశారు. ఒక్కో కోడి రూ. 2,500 నుంచి రూ. 10వేల వరకు ధర పలుకుతుందని పెంపకందారులు చెబుతున్నారు. వీటిల్లో పెట్టమర, నెమలి, కాకి డేగ, డేగ, రసంగి, పింగళి, పర్ల, పచ్చకాకి వంటి అనేక రకాల పందెం కోళ్లు ఉండగా ఇందులో ఎక్కువగా కాకి డేగ, పెట్టమర, రసంగి, పచ్చకాకి రకాలను మాత్రమే ఇక్కడ పెంచుతున్నారు. రంగు, రకం, బరువును బట్టి ధర పలుకుతుంది. వీటి పెంపకానికి పెట్టుబడి భారీగానే ఉంటుంది. రాగులు, సద్దలు, బాదం పలుకులు, కోడి గుడ్లు ఇలా మొత్తం ఒక్కో కోడికి ఏడాదికి రూ.రెండు వేలకు పైగానే ఖర్చు పెడతామని పెంపంకందారులు చెబుతున్నారు. ఇలా బలవర్ధకమైన ఆహారంతో ఏడాదిలో 3 నుంచి 4 కిలోల బరువు వచ్చేలా చూస్తారు. బరువు ఇంతకు తక్కువైనా, ఎక్కువైనా అవి పందేలకు పనికిరావు. కొన్ని కోళ్లు పెరిగిన తర్వాత రోగాల బారిన పడి చనిపోతాయి. కోళ్ల పెంపకం ఇక్కడి వారికి ఉపాధిగా మారింది. చెరుకు కొట్టే పనులకు ఆంధ్రా ప్రాంతానికి వెళ్లిన ఇక్కడి కూలీలు పందెం కోళ్లను గ్రామానికి తెచ్చుకున్నారు. వలసకు వెళ్లగా ఇంటి వద్ద ఉన్న వారు ఈ కోళ్ల పెంపకాన్ని వ్యాపకంగా చేసుకొని దీనిని వ్యాపారంగా చేసుకుని డబ్బులు సంపాదించుకుంటారు. సంక్రాంతి సందర్భంగా ఏటా ఈ గ్రామం నుంచి పెద్ద 3వ పేజీలో...

## ఒకే నెలలో ఆరు సార్లు ఢిల్లీకి సీఎం

### రాష్ట్ర పాలన మొత్తం ఢిల్లీ నుంచే..

- లక్షల్లో రేషన్ కార్డులను తొలగించాలానే ప్రయత్నాలు
- గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై విచారణ చేయిస్తాం
- బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



**హైదరాబాద్, జనవరి 13 (సమ సమాజం):** ఒకే నెలలో సీఎం రేవంత్ రెడ్డి ఆరు సార్లు ఢిల్లీకి వెళ్ళారు.. రాష్ట్ర పాలన మొత్తం ఢిల్లీ నుంచే కొనసాగుతోందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై విచారణ చేయిస్తామని కేసీఆర్ అసెంబ్లీ 4వ పేజీలో...

## ఆటో కార్మికులను ఆదుకోవాలి

- 15వేల జీవనభృతి ఇవ్వాలి
- హరీష్ రావు డిమాండ్



**సిద్దిపేట, జనవరి 13 (సమ సమాజం):** కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులను రోడ్డున పడేసిందని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోలేని స్థితిలో ఉన్నారని చెప్పారు. వారికి ప్రతి నెల రూ. 15 వేల జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా డిగ్రీ కళాశాల మైదానంలో ఆటో డ్రైవర్ల ఆటల పోటీలను హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆటోకార్మికులు కొన్ని రోజులుగా నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం ఒకరికి మంచి చేస్తూ ఇంకొకరి ఉసురు పోసుకోవద్దని సూచించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మంచి కార్యక్రమమే అయినప్పటికీ.. బస్సులు దొరక్క ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. 3వ పేజీలో...

## 5 లక్షల ఎకరాల్లో కొత్త ఆయకట్టును సృష్టిస్తాం

- సాగునీటి ప్రాజెక్టులపై పూర్తి స్థాయిలో దృష్టి
- నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**హైదరాబాద్, జనవరి 13 (సమ సమాజం):** ఈ ఏడాది చివరి నాటికి దాదాపు 5 లక్షల ఎకరాల్లో కొత్త ఆయకట్టును సృష్టించాలనే లక్ష్యంతో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై పూర్తి స్థాయిలో వ్యయం చేయబోతోందని నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం జలసౌధలో నీటి పారుదల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం అనంతరం మీడియా ప్రతినిధుల సమావేశంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున వృధా మరియు అనుత్పాదక వ్యయాన్ని సమీక్షా సమావేశంలో బహిర్గతం చేశామని వివరించారు. పర్యవసానంగా, ప్రస్తుత ప్రభుత్వం నీటిపారుదల కింద కొత్త ఆయకట్టును పెంచడంపై దృష్టి సారించి, సరైన వ్యయానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. కొత్త ఆయకట్టును వేగంగా ఉత్పత్తి చేయగల ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తామని ఆయన నొక్కి చెప్పారు. మేము సమావేశంలో ప్రాజెక్ట్‌లు వ్యయం గురించి చర్చించామని 6 నెలల్లో మరియు సంవత్సరంలోపు కొత్త ఆయకట్టు లను సృష్టించగల వాటిని గుర్తించాము. మేము ఆరు నెలల్లో ఈ లక్ష్యాన్ని సాధించే ప్రాజెక్ట్‌లపై ఖర్చును పెంచాలనే నిర్ణయంతో కొత్త ఆయకట్ సృష్టికి కృషి చేస్తున్నామని సంవత్సరంలో డిసెంబర్ 3వ పేజీలో...

## ఇండియా కూటమి చైర్మన్‌గా ఖర్గే

### కూటమి సమన్వయకర్తగా నితీష్ కుమార్

- వర్చువల్ సమావేశంలో కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ, జనవరి 13 (సమ సమాజం):** ఇండియా కూటమి నేతల వర్చువల్ సమావేశంలో పాల్గొనింది. ఈ మీటింగ్ లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కూటమి ఛైర్మన్ గా నియమించింది. అదే సమయంలో బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ జాతీయ అధ్యక్షుడు నితీష్ కుమార్‌ను కూటమికి సమన్వయకర్తగా ఎన్నిక అయ్యారు. దాదాపుగా కూటమిలోని అన్ని పార్టీల నేతలు ఆయన పేరును ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. దీంతో పాటు సీట్ల పంపకంలో ఎదురవుతున్న సవాళ్ల పైనా ప్రధానంగా చర్చించారు. అయితే, కోఆర్డినేటర్ పదవి ప్రతిపాదనపై నితీష్ కుమార్ మొదట మాట్లాడుతూ.. నాకు ఏ పదవి పైనా కోరిక లేదన్నారు. గతంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రధానమంత్రి పదవికి మల్లికార్జున ఖర్గే పేరును ప్రతిపాదించారు. ఆ ప్రతి పాదనకు ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మద్దతు ఇచ్చారు. ఇక, ఈ సమావేశానికి ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుమారుడు తేజస్వీ యాదవ్, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు పలువురు నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశానికి టీఎంసి అధినేత్రి మమతా 4వ పేజీలో...

## నేడు భారత్ న్యాయయాత్ర ప్రారంభం

### యాత్రలో పాల్గొననున్న సీఎం



**హైదరాబాద్, జనవరి 13 (సమ సమాజం):** సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు.నేటి నుంచి మణిపూర్‌లో ప్రారంభం కానున్న భారత్ న్యాయయాత్రలో పాల్గొని, అదే రోజున దావోస్ వెళ్లనున్నారు.దీంతో భర్తీ కావాల్సిన కౌన్సిల్ సభ్యుల ఎంపిక విషయంలో అధిష్ఠానంతో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అదేవిధంగా నామినేటెడ్ 3వ పేజీలో...

# ఊరంతా సంక్రాంతి

సంక్రాంతితో పల్లెల్లో జనాల రాకతో కళకళలాడుతున్నాయి. ఎపిలోని పల్లెల్లో ఆడపడచుల రాకతో పల్లెల్లో సందడి వాతావవరణం నెలకొంది. ఈ క్రమంలో ఇంకా కొందరు తమ స్వస్థలాలకు వెడుతూనే ఉన్నారు. జిల్లాల్లో సంక్రాంతి పండుగ సందడి మొదలైంది. ఊరూరా ఆకట్టుకునే ముగ్గులు...గ్రామాల్లో గంగిరెద్దుల సందడి...పిండివంటల వాసనలు పల్లెల్లో ప్రకృతి అందాలు మత్తెక్కించేలా ఉన్నాయి. పండుగకు తోడుగా వరుస సెలవులు రావడంతో ప్రజలంతా తమ స్వస్థలాలకు బయలుదేరారు. పండగవేళ సొంతూరులో ఉండాలన్న ఆనందంలో ప్రజలంతా బయలుదేరడంతో నగరాలు ఖాళీ అవుతున్నాయి. ఇప్పటికే విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చారు. దాదాపుగా అందరూ సెలవుల్లో ఉన్నట్లుగానే ఉన్నారు. భోగి,. సంక్రాంతి,కనుమ రోజులు వరుసగా సెలవులు రావడంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు మూడు రోజులు వరుసగా సెలవులు కలిసి వస్తున్నాయి. సంక్రాంతి పండుగకు ఇంటికి వెళ్లి వచ్చేందుకు సెలవులు అనువుగా ఉండడంతో.. అంతా ఊరి బాట పట్టారు.. గతానికి భిన్నంగా ఉభయతెలుగు రాష్ట్రాల్లో ఆర్టీసీ ఎలాంటి అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా సర్వీసులు నడుపుతోంది. తెలంగాణలో మహిళలకు ఉచిత ప్రయాణం కలసి వస్తోంది. అయితే ప్రైవేట్ ట్రావెల్స్ వాళ్లు ఛార్జీల పేరుతో దోపిడీకి పాల్పడడం మాత్రం ఆగలేదు. ఇదే అదనుగా అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఇకపోతే ప్రైవేట్ విమానాల ఛార్జీలు కూడా ఆకాశాన్నం టాయి. హైదరాబాద్ నుంచి రాజమండ్రి, విజయవాడ, విశాఖ పట్టణం వెళ్లాలనుకున్న వారికి చుక్కలు చూపిస్తున్నారు. భోగి, మకర, కనుమ సంక్రాంతి పండుగల సందర్భంగా కళాశాలలు, పాఠశాలలకు ప్రభుత్వం ఐదు రోజుల పాటు సెలవులు ప్రకటించింది. , ఆది,సోమవారాలు పండగ కావడంతో సెలవులు పోయాయన్న బాధలో ఉద్యోగులు ఉన్నారు. హైదరాబాద్‌లో ఉద్యోగ రీత్యా స్థిర నివాసం ఉంటున్న వారు, ఉన్నత విద్య అభ్యసించేందుకు హైదరాబాద్ లో ఉంటున్న యువతీ యువకులు పండుగల సందర్భంగా తమ స్వస్థలాలకు చేరుకుంటున్నారు. ఈ సందర్భం గా హైదరాబాద్‌లో బస్ స్టేషన్లు, రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసి పోయాయి. పండుగకు పది రోజుల ముందుగానే రిజర్వేషన్లు చేసుకున్నారు. బస్సుల్లో సీట్లు దొరకక ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తుండగా.. ఇదే అదనుగా భావించి ప్రైవేట్ ట్రావెల్స్ వారు ఇష్టానుసారంగా టికెట్ రేట్లు పెంచి ప్రయాణికుల నుంచి డబ్బులు దండుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. హైదరాబాద్‌తో పాటు గుంటూరు, కాకినాడ, నెల్లూరు,విశాఖ,శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు. డిపోల పరిధిలో ఆయా గ్రామాలకు ప్రయాణికులను తరలించేందుకు బస్సులను సిద్ధంగా ఉంచామని.. ప్రయాణికుల రద్దీని బట్టి అప్పటికప్పుడు బస్సు సమకూరుస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రజల ఆదుర్దాను ప్రైవేటు ట్రావెల్స్‌వారు తమకు అనుకూలంగా మార్చుకొని భారీ ఎత్తున దోపిడీ చేస్తున్నారు. కొన్ని రూట్లలో టిక్కెట్ కంటే మూడు రెట్లు ధరలు పెంచేశారు. నలుగురు సభ్యులు ఉన్న కుటుంబం పండుగకు వూరు వెళ్లి రావాలంటే ఖర్చు తడిసి మోపెడవుతోంది. విశాఖపట్నం లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాంటే రాను పోను బస్సుల్లో రూ.15వేల వరకు వదిలించుకోవాల్సిందే. చాలీచాలని వేతనాలతో నగరంలో బతికే చాలా కుటుంబాలు ఈ టిక్కెట్ల ధరలు భరించలేక అసలు సంక్రాంతికి ఊరెళ్లడం మానుకు నే పరిస్థితి నెలకొంది. అటు రాయలసీమ జిల్లాలకు వెళ్లాలన్నా ఇదే తీరు. అడ్డగోలుగా భారీ ఎత్తున ధరలు పెంచినా సరే నియంత్రించే వారు లేకపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్ ఆగడాలకు అడ్డు లేకుండా పోయిందని ప్రయాణికులు వాపోతున్నారు. మూడు నాలుగురోజుల నుంచే తమ దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఆర్టీసీ కూడా

ప్రత్యేక బస్సులు వేసినా సరిపోని పరిస్థితి ఏర్పడింది. దీంతో పలు ప్రైవేటు ట్రావెల్స్ అడ్డగోలుగా ధరలు పెంచడం సామాన్య ప్రయాణికులకు పెనుభారంగా మారింది. చాలామంది ట్రావెల్స్ నిర్వాహకులు సీట్లను బ్లాక్ చేసి మూడింతలు, నాలుగింతల ధరలకు విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో బస్సుల టిక్కెట్లు విక్రయించే పోర్టళ్లకు ఎలాంటి నియంత్రణ ఉండటం లేదు. అప్పటికప్పుడు ఇవి అడ్డగోలుగా ధరలు పెంచి విక్రయిస్తున్నాయి. వారాంతం కోసం ముందే పెద్దఎత్తున టిక్కెట్ల ధరలు పెంచి సీట్లను విక్రయించడానికి పక్కా ప్రణాళిక రూపకల్పన జరిగిపోయింది. బహిరంగంగా దోపిడీ చేస్తున్నా సరే.. సంబంధిత అధికారులకు చీమ కుట్టినట్లైనా లేకపోవడం గమనార్హం. భారీ ఎత్తున ధరలు పెంచినా సరే నియంత్రించే వారు లేకపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్ ఆగడాలకు అడ్డు లేకుండా పోయిందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రైవేటు ట్రావెల్స్‌కు బాగా కలిసొచ్చినట్లైంది. జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులంతా గురువారమే స్వగ్రామాలు, ప్రాంతాలకు బయలు దేరారు. దీంతో ప్రధాన రాహదారులపై వాహనాల రద్దీ పెరిగింది. ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసి పోయాయి. మసంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలను వివిధ ప్రాంతాలకు తరలించేందుకు ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు డిపోల వారీగా అదనపు బస్సులను ఏర్పాటు చేశారు. జిల్లాలకు చెందిన బస్సులు హైదరాబాద్ నుంచి ఆంధ్రాప్రాంతానికి కూడా నడుపుతున్నారు. కాకినాడ, కడప, అనంతపురం, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, రాజోలు ప్రాంతాలకు నడుపుతున్నారు. హైదరాబాద్‌తో పాటు ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులకు ఈ బస్సుల్లో తమ స్వస్థలాలకు వచ్చేందుకు వీలుగా ఉండనున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్‌తో పాటు పల్లెలకు కూడా రద్దీని బట్టి అప్పటి కప్పుడు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసారు. గత సంక్రాంతి పండగకు ఆర్టీసీకి గణనీయంగా ఆదాయం సమకూరింది.

# ఆర్టీసీకి పెరగనున్న ఆదాయం

## ఉమ్మడి జిల్లా నుంచి పలు ప్రత్యేక బస్సులు




**ఆదిలాబాద్, జనవరి 13 (సమ సమాజం):** ఆదిలాబాద్ రీజియన్‌లో సంక్రాంతి పండగ వారం రోజుల్లో భారీగా ఆదాయం సమకూరిందని తెలుస్తోంది. ఈ సారి కూడా పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈనెల 13,14,15 తేదీల్లో అదనపు సర్వీసులు నడుపుతుండగా.. తిరుగు ప్రయాణంలో ఈనెల 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీని బట్టి అప్పటికప్పుడు మరిన్ని బస్సులను పెంచేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఉన్న డిపోల నుంచి రాష్ట్ర రాజధాని మరిన్ని 55సర్వీసులను నడుపుతున్నారు. నిర్మల్ ,మంచిర్యాల, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), బెల్లంపల్లి, మందమర్రి, బాసర ప్రాంతాలకు రైలు సౌకర్యం ఉంది. రైళ్లలోనూ తమ స్వస్థలాలకు చేరేందుకు ప్రయాణికులు పెద్ద ఎత్తున వరుస కడుతున్నారు. దీంతో ఆయా రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో వాహనాల రద్దీ ఉంటుందని.. నేరడిగొండ, కడ్తాల్ టోల్ ప్లాజాల వద్ద అన్ని ద్వారాలు తెరిచేశారు. చాలామంది బస్సు ప్రయాణాన్ని ఎంచుకోవడంతో వీటికి డిమాండ్ భారీగా పెరిగింది. సాధారణ రోజుల్లో హైదరాబాద్‌నుంచి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు 500-600 వరకు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు నడుస్తుంటాయి. అదే సంక్రాంతికి ముందు మూడురోజులు ఆ సంఖ్య ఇంకా పెరుగుతుంది. ఆర్టీసీ కూడా ప్రత్యేక బస్సులు వేసినా సరిపోని పరిస్థితి. దీంతో పలు ప్రైవేటు ట్రావెల్స్ అడ్డగోలుగా ధరలు పెంచడం సామాన్య ప్రయాణికులకు పెనుభారంగా మారింది. చాలామంది ట్రావెల్స్ నిర్వాహకులు సీట్లను బ్లాక్ చేసి మూడింతలు, నాలుగింతల ధరలకు విక్రయిస్తున్నారు. రవాణాశాఖకు ఛార్జీలు ఎగవేసేందుకు తప్పుడు మార్గాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న నిర్వాహకులు ప్రతి స్టేజీలో ఆపుతూ ప్రయాణికులను ఎక్కించుకుంటున్నాయి. ఉన్నతాధికారులు ప్రమాదాలు జరిగిన సమయాల్లో హడావుడి చేయడం, తర్వాత చేతులు దులిపేసు కోవడం సర్వసాధారణమైందనే విమర్శలున్నాయి. పలు ప్రైవేటు ట్రావెల్స్ నిబంధనలను గాలికి వదిలేస్తున్నాయి.

# భోగి రోజున రేగిపళ్లును ఎందుకు పోస్తారు?



**హైదరాబాద్, జనవరి 13 (సమ సమాజం):** తెలుగు లోగిళ్లలో సంక్రాంతి సందడి మొదలైంది. మూడు రోజుల పాటు ప్రతి ఇంట సంబరాలు అంబరాన్ని తాకుతాయి. మొదటి రోజు జరుపుకునే భోగి పండగ అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది భోగి మంటలు, భోగి పళ్లు. చిన్న పిల్లలకు పేరంటం చేసి.. నెత్తి మీద రేగుపళ్లను పోస్తారు. ఈ రేగుపళ్లు భోగి రోజున భోగిపళ్లుగా మారిపోతాయి. అయితే చిన్న పిల్లలకు భోగి రోజున రేగుపళ్లని పోయడంలో అంతరార్థం ఏమిటి? దీని వెనుక ఉన్న ఆధ్యాత్మిక రీజన్ శాస్త్రీయ కోణం ఏమిటి ఈ రోజు తెలుసుకుందాం.. ఎవరి ఇంట్లోనైనా ఐదేళ్ల లోపు చిన్న పిల్లలు ఉంటే వారి ఇంట్లో భోగి రోజు సాయంత్రం సందడే సందడి. ఇంటి ఇరుగు పొరుగువారికి స్నేహితులను పిలిచి చిన్న పిల్లలకు భోగి పళ్లను పోస్తారు. ఈ సమయంలో చిన్న పిల్లలను సాక్షాత్తు శ్రీమన్నారాయణుడినిగా భావిస్తారు. ఎందుకంటే రేగిపళ్ళను సంస్కృతంలో బదరీఫలం అంటారు. బదరీశుడు అంటే శ్రీ మహా విష్ణువు. రేగి పళ్లలో చామంతి, బంతి పువ్వు రేకులతోపాటు, చిల్లర నాణేలు కలిపి భోగి పళ్లు సిద్ధం చేస్తారు. తర్వాత వీటిని చిన్నారుల తల చుట్టూ మూడు సార్లు తిప్పి దిష్టి తీసి తలపై పోసి.. అక్షతలతో దీవిస్తారు. ఇలా చేయడం వలన తమ పిల్లలపై విష్ణువు అనుగ్రహం ఉంటుందని విశ్వాసం. అంతేకాదు తలపై భాగంలో బ్రహ్మరంధ్రం ఉంటుందట.. ఇలా భోగి పండ్లను పోస్తే పిల్లలు జ్ఞానవంతులవుతారని పెద్దల విశ్వాసం. సంక్రాంతి నాటికి అందుబాటులోకి వచ్చే ఈ రేగు పళ్లు రుచికి పుల్లపుల్లగా ఉంటాయి. అంతేకాదు సకల ఆరోగ్యాలనూ అందించే ఔషధి గుణాలతో నిండి ఉంటాయి. ఈ భోగి పళ్లను ఐదేళ్లలోపు పిల్లలకి పోస్తారు. ఈ సమయంలో పిల్లల్లో రోగనిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. అంతేకాదు ఊపిరితిత్తులు, జీర్ణవ్యవస్థ చాలా బలహీనంగా ఉంటాయి. కనుక ఈ వయసు పిల్లలకు రేగుపళు ఒక ఔషధం అని విశ్వాసం. వీటిలో 'సి'విటమిన్ చాలా ఎక్కువ. కనుక రోగనిరోధకశక్తిని పెంచుతుంది. అంతేకాదు జీర్ణసంబంధమైన వ్యాధులతో పాటు ఉదరసంబంధ ఇబ్బందుల నుంచి ఉపశమనం కూడా ఇస్తాయట. ఇక బంతిపూల రెక్కలు క్రిమి సంహారిణి. బంతి పువ్వులు చర్మ సంరక్షణ గుణం కలిగి ఉన్నాయి. ఎటువంటి చర్మసంబంధమైన వ్యాధినుంచైనా ఉపశమనం కలిగించే గుణం ఈ పువ్వుల సొంతం. కనుక మన పెద్దలు చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంచేందుకు ఇలా భోగి పళ్లు పొసే సాంప్రదాయం పెట్టి ఉండవచ్చు.

# వీధి కుక్కల దాడిలో 7 నెలల బాలుడి మృతి

## మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్ నగరంలో ఘటన



**భోపాల్, జనవరి 13 (సమ సమాజం):** విధికుక్కలు చిన్నారుల ప్రాణాలను తీస్తున్నాయి. ఇటీవల పలు రాష్ట్రాల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. తాజాగా మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్ నగరంలో ఏడు నెలల బాలుడిపై వీధికుక్కలు దాడి చేసి ప్రాణం తీశాయి. ఈ ఘటన బుధవారం నగరంలోని అయోధ్య నగర్ ప్రాంతంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సంఘటనను పోలీసులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటన జరిగిన రోజున పిల్లాడి మృతదేహాన్ని పూడ్చి పెట్టారు. పోలీసులు మళ్లీ మృతదేహాన్ని వెలికి తీసి, శనివారం పోస్టుమార్టం కోసం పంపారు. చిన్నారి తల్లిదండ్రులు కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తల్లి పిల్లాడిని నేలపై పడుకోబెట్టి పక్కనే పనిచేసుకుంటుండగా.. ఈ దాడి జరిగినట్లు అయోధ్య నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహేష్ నిల్వారే తెలిపారు. కుక్కల గుంపు చిన్నారిని కొరికి ఈడ్చుకెళ్లిందని చెప్పారు. కుక్కల దాడిలో శిశువు శరీరం నుంచి చేయి విడిపోయింది, అక్కడిక్కడే మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉంటే జిల్లా యంత్రాంగం బాలుడి కుటుంబానికి రూ. 50,000ల ఆర్థిక సాయాన్ని అందించింది. మరో రూ. 50,000 త్వరలో అందిస్తామని అధికారులు చెప్పారు. భోపాల్ మునిసిపల్ కార్పొరేషన్ అయోధ్య నగర్ ప్రాంతం నుండి ఎనిమిది వీధి కుక్కలను పట్టుకుంది.

# శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు రామ్‌చరణ్ దంపతులకు ఆహ్వానం



**హైదరాబాద్, జనవరి 13 (సమ సమాజం):** జనవరి 22న జరగనున్న శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు అయోధ్య నుంచి ప్రముఖులకు, రాజకీయ నాయకులకు, వ్యాపారులకు, సినీనటులకు ఆహ్వానాలు అందుతున్నాయి. రామమందిర ట్రస్టు ప్రతినిధులు హీరో రామ్‌చరణ్, ఉపాసన దంపతులను ఆహ్వానించారు. ఇప్పటివరకు చిరంజీవి, ప్రభాస్, అమితాబ్ బచ్చన్, రణ్‌బీర్ కపూర్ దంపతులు, రాజ్‌కుమార్ హిరాణీ, రోహిత్ శెట్టి, ధనుష్ ఆహ్వానాలు అందుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు దేశ ప్రజల తరపున ప్రతినిధిగా ఉండనుండటం తన అదృష్టమని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని 11 రోజులపాటు ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రామ భక్తులందరికీ ఒక పవిత్రమైన సందర్భమని మోదీ అన్నారు.

# దళిత బిడ్డ రిటైర్డ్ డీజీపీ బాబూరావుకు గౌరవ డాక్టరేట్..!

## ప్రతిష్టాత్మక ఫ్రాన్స్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం




**గుంటూరు, జనవరి 13 (సమ సమాజం):** తెలుగు జాతి రత్నం, నిజాయతీకి నిలువుటద్దం అయిన రిటైర్డ్ డీజీపీ బాబూరావుకు ప్రతిష్టాత్మక ఫ్రాన్స్ ఎకోల్ సుపరీయర్ రాబర్ట్ డీసోర్బన్ యూనివర్సిటీ.. గౌరవ డాక్టరేట్ అందించింది. భారతదేశంలో ఎంతోమంది ప్రముఖులకు అందించిన ఈ అవార్డ్ ఇప్పుడు బాబూరావును వరించింది. అంబేద్కర్ ఆశయాలతో పోలీస్ అధికారిగా ఆయన ప్రజలకు చేసిన సేవలను గుర్తించిన ఈ యూనివర్సిటీ.. భారత్ సమ్మాన్ అవార్డ్ తో పాటు గౌరవ డాక్టరేట్ ను ఈనెల 12వ తేదీన దుబాయ్ వేదికగా అందించింది. మధ్యప్రదేశ్ కేడర్ లో ఐపీఎస్ అయి.. దళిత జాతి నుంచి అత్యున్నత స్థానానికి ఎదిగి అడిషనల్ డీజీపీ హోదాలో ఎంతోమందికి సేవ చేసిన కూచిపూడి బాబూరావును ఇప్పుడు డాక్టరేట్ వరించింది. గుంటూరు జిల్లా అమృతలూరు మండలం పెదపూడి గ్రామంలో శ్రీ కూచిపూడి ప్రకాశం, అనంతమ్మ దంపతలుకు జన్మించారు బాబూరావు. ఆయన తల్లిదండ్రులిద్దరూ ఉన్నత విద్యావంతులు. ఇద్దరూ ఉపాధ్యాయులుగా పని చేశారు. ఉపాధ్యాయ కుటుంబం నుంచి వచ్చిన ఆయన ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎమ్ ఏ పూర్తి చేశారు. 1980లో బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పీవోగా పని చేశారు. 1991లో ఆయన మధ్యప్రదేశ్ కేడర్ ఐపీఎస్‌గా సెలెక్ట్ అయ్యారు. అప్పటి నుంచి మధ్యప్రదేశ్ లో ఐపీఎస్ అధికారిగా అనేక హోదాల్లో పని చేసి ప్రజలకు చేరువయ్యారు బాబూరావు. 36 ఏళ్లపాటు పోలీస్ అధికారిగా మచ్చలేని వ్యక్తిగా.. ప్రజాసేవలో తన జీవితాన్ని మమేకం చేశారు. అక్కడ కరడుగట్టిన క్రిమినల్స్ నేరస్వభావాన్ని మార్చడానికి విపరీతంగా ప్రయత్నించారు. అలాగే వివిధ నేరాల్లో చిక్కుకుని జైలుపాలయిన నేరస్తుల కుటుంబసభ్యులకు అండాదండగా నిలిచారు. కుటుంబపెద్ద నేరం చేసి జైలు కెళ్తే.. మిగిలిన కుటుంబ సభ్యులంతా ఆర్థికసమస్యలతో సతమతమవుతున్న విషయం తెల్సుకుని.. బాబూరావు వారందరినీ అనేక రకాలుగా ఆదుకున్నారు. నేరస్తుల పిల్లల్ని చదివించడమే కాకుండా.. వారు ఉన్నత స్థానాలకు చేరుకునేలా ప్రోత్సహించారు. అడిషనల్ డీజీపీ హోదాలో ఆయన రిటైర్ అయ్యారు. ప్రజాసేవలో ఆయన సేవాభావ ధృక్పథం, ప్రజలకు సేవ చేయడంలో ఆయన పడిన తపనను కోల్ సుపీరియర్ రాబర్ట్ డీ సోర్బన్ యూనివర్సిటీ గుర్తించింది. ఆయనకు గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేయాలని నిర్ణయించింది. భారతదేశం నుంచి ఈ భారత్ సమ్మాన్ అవార్డ్, గౌరవ డాక్టరేట్ ను ఇంతకుముందు అనేకమంది ప్రముఖులు అందుకున్నారు.. భారత విదేశీవ్యవహారాల శాఖమంత్రి శ్రీమతి డాక్టర్ మీనాక్షిలేఖీ, ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహాన్ని తయారు చేసిన పద్మభూషణ్ డాక్టర్ రామ్ సుతార్, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ గ్రెగ్ చాపెల్, సినీ నటుడు డాక్టర్ అంజన్ శ్రీవాస్తవ్, బాలీవుడ్ నటుడు సోనూసూద్, కాంగో రక్షణమంత్రి డాక్టర్ సిల్వైన్ ముటోమ్ డో, దుబాయ్ ఫార్మసీ మంత్రి డాక్టర్ అలీ అల్ సయ్యద్ హుస్సేన్, ఇండియన్ క్రికెటర్ హర్భజన్ సింగ్ లాంటి ఎంతోమంది ప్రముఖులు ఈ ఆవార్డును పొందారు. ఇప్పుడు అదే లిస్టులో మన తెలుగు జాతి రత్నం కూచిపూడి బాబూరావు చేరారు. భారతదేశం గర్వించదగ్గ వ్యక్తులకు మాత్రమే ఈ అవార్డ్, డాక్టరేట్ లభిస్తుంది. ఇప్పుడు అదే అవార్డ్ ను అందుకున్న బాబూరావు తెలుగుజాతికి గర్వకారణంగా నిలిచారు.

# రైళ్లలో నిలబడే చోటు కూడా కరువే

## సంక్రాంతికి తోడు అయ్యప్ప భక్తులు



**విజయవాడ, జనవరి 13 (సమ సమాజం):** రైళ్లలో రద్దీతో ప్రయాణికుల నానాయాతన పడుతున్నారు. ఓ వైపు అయ్యప్ప భక్తులు మరోవైపు సంక్రాంతి రద్దీతో నిబడడానికి కూడా చోటు లేకుండా ప్రయాణికులు పరుగులు తీస్తున్నారు. రైలెక్కితే చాలన్న రీతిలో ప్రయాణికులు వెళుతున్నారు. ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్టు రైళ్లలో నిలబడి ప్రయాణిస్తుండగా.. ప్యాసింజర్ రైళ్లలో నిలబడటానికి కూడా చోటు ఉండటం లేదు. కాచిగూడ నుంచి చిత్తూరు, బెంగళూరు, యశ్వంత్‌పూర్, తిరుపతి, కర్నూలు, గుంటూరు, గుంతకల్ ఇలా ప్రతి రైళ్లోనూ ప్రయాణికుల రద్దీ తీవ్రంగా ఉంది. బస్సుల్లో ఏకంగా ప్రత్యేక ఛార్జీలు వసూలు చేస్తుండటంతో ప్రయాణికులు రైళ్లను ఆశ్రయిస్తున్నారు. రైళ్లకు సంక్రాంతి రద్దీ పెరిగడంతో హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్లే రైళ్లన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. హైదరాబాద్ నగరంలో స్థిరపడినవారు, వివిధ పనులపై వచ్చిన వారు సొంతూళ్లకు వెళ్తున్నారు. దీంతో మహబూబ్‌నగర్ రైల్వే స్టేషను మీదుగా వెళ్లే ప్రతి రైలుకు రెండు రోజులుగా రద్దీ పెరిగింది. గుంటూరు, కర్నూలు టౌన్, చెన్నైఎగ్మూర్ రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిశాయి.

# చంద్రబాబు, పవన్ వరుస భేటీలు

పార్టీల్లోకి పలువురు నేతల చేరికలు!!♦పండగ తర్వాత ఫస్ట్ లిస్ట్ రిలీజ్ చేసే ఆలోచన



**విజయవాడ, జనవరి 13 (సమ సమాజం):** మార్పు.. రెండక్షరాలే కానీ ఇప్పుడు ఆ పదం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారింది. ఆ గట్టున కూడా మార్పు మాట రాజకీయాల్లో కొత్తబాట వేస్తోంది. వైనాట్ 175 టార్గెట్‌గా అధికార వైసీపీ అభ్యర్థుల మార్పు ప్రక్రియ అల్రెడీ పట్టాలెక్కింది. ఇక టీడీపీ – జనసేన మధ్య సర్దుబాటు ఓ కొలిక్కి వచ్చినట్లు కనిపిస్తోంది. పొత్తులో భాగంగా చేర్పు కోసం ఎక్కడెక్కడ మార్పులుంటాయన్న చర్చ మొదలైంది. వాటి సంగతి ఎలా వున్నా.. మార్పే లక్ష్యం..పొత్తే మార్గం అంటూ టీడీపీ-జనసేన ఒక్కటిగా ఒకే వేదికపై వచ్చాయి. ఇప్పటికే 50కి పైగా స్థానాల్లో వైసీపీ అభ్యర్థులను ప్రకటించింది. అటు ప్రచారంలోనూ స్పీడ్ పెంచేలా జనవరి 25 నుంచి రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించేలా సీఎం జగన్ షెడ్యూల్ ఫిక్స్ చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు తెలుగుదేశం, జనసేన ఉమ్మడి కార్యాచరణ వేగవంతమైంది. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో.. మేనిఫెస్టో ఫైనల్ చేయడంతో పాటు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తోంది. పార్టీల్లోకి పలువురు నేతల చేరికల నేపథ్యంలో చంద్రబాబు, పవన్ వరుసగా భేటీ అవుతున్నారు. తాజాగా మరోసారి వీళ్లిద్దరి భేటీ కాబోతున్నారు. ఎల్లుండి లేదంటే పండగ తర్వాత ఫస్ట్ లిస్ట్ రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నారు చంద్రబాబు. అమరావతిలోని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నివాసంలో జరిగే భోగి వేడుకల్లో చంద్రబాబుతోపాటు జనసేనా అధ్యక్షులు పవన్ కల్యాణ్ పాల్గొననున్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు మందడంలోని గోల్డెన్ రూల్ స్కూల్‌లో ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా వినూత్న రీతిలో భోగి పండుగను జరుపుకోవాలని రెండు పార్టీ అధినేతలు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రజా వ్యతిరేక జీవోలను భోగి మంటల్లో వేసి నేతలు నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ రాత్రికి చంద్రబాబు నివాసానికి పవన్ వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఇద్దరూ డిన్నర్ మీటింగ్‌లో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. దాదాపు రెండు గంటల సేపు వీరు చర్చలు జరిపే అవకాశం ఉంది. సీట్ల సర్దుబాటుపై ప్రధానంగా వీరు చర్చించనున్నారు. ఎవరు ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలి? ఎవరెవరు ఎక్కడెక్కడ పోటీ చేయాలి? అనే విషయంపై చర్చలు జరుపనున్నట్లు సమాచారం. అయితే తెలుగుదేశం పార్టీ తన తొలి జాబితాను సంక్రాంతి రోజున విడుదల చేయాలని భావిస్తున్న తరుణంలో ఈ డిన్నర్ మీటింగ్ ప్రాధాన్యత సంతరించుకుంది. దాదాపు 20 నుంచి 25 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేయడానికి టీడీపీ సన్నాహాలు చేస్తోంది. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో అన్ని సామాజిక వర్గాలకు సంబంధించి అభ్యర్థులు ఉండేలా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఎటువంటి వివాదాలు లేని, జనసేన కోరుకోని నియోజకవర్గాలను మాత్రమే ఎంపిక చేసి అభ్యర్థులను ప్రకటిస్తారని సమాచారం. కుప్పం నియోజకవర్గం నుంచి చంద్రబాబు నాయుడు, టెక్కలి నుంచి అచ్చెనాయుడు, మంగళగిరి నుంచి నారా లోకేష్ వంటి పేర్లు తొలి జాబితాలో ఉండే అవకాశముందని తెలుస్తోంది. ఇక జనసేనతో సీట్ల సర్దుబాటు, షెడ్యూల్ విడుదలైన తర్వాత ఫిబ్రవరిలో జాబితాలు వెలువడే అవకాశముందని సమాచారం.

# రాజేంద్రనగర్‌లోని అత్తాపూర్‌లో విషాదం

బాలుడి ప్రాణం తీసిన పతంగి





**హైదరాబాద్, జనవరి 13 (సమ సమాజం):** సంక్రాంతి పండుగ సెలవుల్లో ఓ కుటుంబంలో తీరని విషాద ఛాయలు అలుముకున్నాయి. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని అత్తాపూర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విద్యుత్ షాక్‌తో 11 ఏళ్ల బాలుడు తనిష్క్ మృతిచెందాడు. సంక్రాంతి సెలవులు కావడంతో గాలి పటాలు ఎగుర వేయడానికి తన ముగ్గురు స్నేహితుల తో కలిసి మిద్దె మీదకు వెళ్లాడు. ఈ క్రమంలో గాలిపటం విద్యుత్ వైర్లకు తగిలి కరెంట్ షాక్‌తో బాలుడు అక్కడే కుప్పకూలిపోయాడు. తల్లిదండ్రులు హుటాహుటిన తనిష్క్ ను ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందాడని వైద్యులు ధృవీకరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గాలిపటం ఎగురవేసేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పిల్లలకు సూచించారు. సెలవుల్లో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని పోలీసులు తల్లిదండ్రులను హెచ్చరించారు. తమ గారాల పట్టి.. ఇక కనిపించడని తెలిసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

# ఆటో కార్మికులను ఆదుకోవాలి



మారుమూల గ్రామాలకు మరిన్ని బస్ సౌకర్యాలు పెంచాలని తెలిపారు. ఆటో కార్మికులకు నెలకు 15వేల జీవన భృతి కల్పించాలని, లేదంటే వారు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని వెల్లడించారు. ఆటోవాలలా జీవితంలో పండుగ వాతావరణం కనుమరుగైందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తమ బాధలు గట్టెక్కుతాయని అనుకున్నారని, కానీ వచ్చిన వారం రోజులకే ఇలా రోడ్డున పడతామని అనుకోలేదంటు న్నారని వ్యాఖ్యానించారు. రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద ఆటో డ్రైవర్లను ప్రభుత్వం నడిరోడ్డుపై వదిలేసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు.వారి సమస్యలపై అసెంబ్లీలో నిలదీస్తామని అన్నారు. దాదాపు 1480 మంది ఆటో డ్రైవర్లకు ఈ సొసైటీలో సభ్యులుగా ఉన్నారని.. వీరికి ఆటల పోటీలు నిర్వహించడం రాష్ట్రానికే ఆదర్శమని పేర్కొన్నారు. పట్టణానికే వారు బ్రాండ్ అంబాసిడర్లని.. సిద్దిపేటకు వచ్చే అతిథులను గౌరవ మర్యాదలతో గమ్య స్థానాలకు చేరుస్తున్నారని కొనియాడారు. అప్పుడప్పుడూ ఆటలు ఆడడం ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని చెప్పారు. సిద్ధిపేట స్పోర్ట్స్ హబ్ గా మారిందని అన్నారు. ఒకరికి మంచి చేయాలనే ఉద్దేశంతో.. వేరొకరి కడుపు కొట్టొద్దని హరీష్ రావు ప్రభుత్వానికి సూచించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మంచి కార్యక్రమమే అయినా.. ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని వారిని ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో 6 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాడతామని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్ల పిల్లల చదువులు, ఆరోగ్యానికి తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే, ఉచిత బస్సు ప్రయాణం వల్ల రద్దీ పెరిగిందని మారుమూల గ్రామాలకు సైతం బస్సు సౌకర్యం పెంచాలని కోరారు.

# నేడు భారత్ న్యాయయాత్ర ప్రారంభం



(మొదటి పేజీ తరువాయి) పదవుల విషయంలో కూడా కాంగ్రెస్ పెద్దలతో చర్చించి ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉండడంతో నిన్న మధ్యాహ్నం సీఎం హుటాహుటిన ఢిల్లీ వెళ్లారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశమై రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులను వివరించే అవకాశం ఉంది. అదేవిధంగా భర్తీ చేసేందుకు సిద్ధంగా ఉన్న రెండు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలకు అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంది. మరొకవైపు ఎమ్మెల్యే కోటా కింద రెండు ఎమ్మెల్సీ పదవుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదలైనందున ఈ నెల 18వ తేదీలోపు నామినేషన్ వేయాల్సి ఉండడంతో అభ్యర్థుల ఎంపిక విషయంలో తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నాలుగు ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ఒక నిర్ణయానికి రావాల్సి ఉంది. అయితే ఎవరిని అభ్యర్థులుగా ఎంపిక చేస్తే పార్టీకి ఏ మాత్రం ప్రయోజనం చేకూరుతుంది, త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు ఎలాంటి ప్రయోజనం చేకూరుతుందో కాంగ్రెస్ పెద్దలకు సీఎం రేవంత్?రెడ్డి వివరించనున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక, నామినేటెడ్ పదవులకు నాయకుల ఎంపిక చేయడం కీలకం కావడంతో వీటిపై కసరత్తు చేశారు. ఈ నాలుగింటిలో ఒకటి ఓసీ, ఒకటి బీసీ, ఒకటి మైనారిటీ, ఒకటి ఎస్సీకి ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో ఎమ్మెల్సీ పదవులను ఆశిస్తున్న ఓసీలల్లో తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం, ప్రోటోకాల్ ఛైర్మన్ వేణుగోపాల్ రావు, మాజీ మంత్రి చిన్నారెడ్డి, పటేల్ రమేశ్?రెడ్డి, బీసీల్లో పీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేశ్?కుమార్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ ఈరావత్రి అనిల్ కుమార్, మైనారిటీల్లో మస్కతి డైరీ సంస్థ అధినేత మస్కతి, విద్యాసంస్థల అధినేత జాఫర్ జావిద్, మైనారిటీ సెల్ జాతీయ కార్యదర్శి ఫయీూమ్ ఖురేషి, మహబూబ్?నగర్ మాజీ డీసీసీ అధ్యక్షుడు ఒబుదుల్లా కొత్వాల్, కుసురపు పాసాలు, ఎస్సీకు ఇవ్వాల్సి వస్తే అద్దంకి దయాకర్ ఆశిస్తున్నారు. వీరిలోనే ఎంపిక చేస్తారా? లేక కొత్తవారు తెరపైకి వస్తారా? అనేది వేచి చూడాలి. రేపు మణిపూర్‌లో న్యాయయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత అదే రోజు ఢిల్లీ చేరుకుని మంత్రి శ్రీధర్‌బాబు, అధికారుల బృందంతో కలిసి దావోస్ వెళ్తారు. 15, 16, 17, 18 తేదీలల్లో అక్కడ జరిగే కార్యక్రమాలల్లో పాల్గొని పెట్టుబడులను ఆకర్శించేందుకు చొరవ చూపుతారు. ఆ తర్వాత లండన్ వెళ్తారు. అక్కడ ఒకరోజుండి ఈ నెల 20వ తేదీన తిరిగి వస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# తెలంగాణ పందెం కోళ్లకు గిరాకీ



(మొదటి పేజీ తరువాయి) సంఖ్యలో పందెం కోళ్లు ఆంధ్రా ప్రాంతానికి తరలుతాయి. ఒక్క పండుగ రోజుల్లోనే కాకుండా ఇతర పండుగలు, సాధారణ రోజుల్లోనూ ఆంధ్రా నుంచే పందెం రాయుళ్లు వచ్చి ఇక్కడి కోళ్లను కొనుగోలు చేస్తారు. ఒక్కో పందెం కోడి పెట్ట ఏడాదికి నాలుగు ఈతలలో అనేక గుడ్లు పెట్టినా.. అందులో 20 నుంచి 30 గుడ్లు పిల్లలుగా మారుతున్నాయి. వాటిని తిరిగి పొదిగిస్తున్నారు.

# కోటి ఎకరాల మాగాణం కోసమే ప్రాజెక్టులు

కెసిఆర్ శ్రమతో నిరంతర విద్యుత్ సదుపాయం

విమర్శలు మాని నిజాలు గమనించాలి: వేముల



**నిజామాబాద్, జనవరి 13 (సమ సమాజం):** తెలంగాణ వ్యాప్తంగా కోటి ఎకరాల బీడు భూములను సాగులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని, కాళేశ్వరం అందులో భాగమని మాజీ మంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. కాళేశ్వరం ఏదో అవినీతి జరిగిందన్న రీతిలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న వాదనలో నిజం లేదన్నారు. విచారణలో అన్నీ తేలుతాయని అన్నారు. కోటి ఎకరాల మాగాణి తెలంగాణ లక్ష్యంగా సిఎం కెసిఆర్ ప్రాజెక్టుల కోసం కృషి చేసారని అన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్తు అందిస్తామని ఇచ్చిన హామీని నిలుపుకున్నామని అన్నారు. కాళేశ్వర్ నీటిని తెచ్చామన్నారు. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి మీదుగా మిడ్ మానేరుకు నీరు వస్తుందని, అక్కడి నుంచి మల్లన్నసాగర్ వరకు నీరు వచ్చేలా పనులు జరిగాయన్నారు. మిడ్ మానేరు నుంచి మల్లన్నసాగర్ 42 కి.మీ.ల దూరం ఉండగా అందులో 33 కి.మీ.ల దూరాన్ని రూ. 10 వేల కోట్లు వెచ్చింది సొరంగం తవ్వకం చేపట్టామన్నారు. మల్లన్నసాగర్ నుంచి నల్గొండ, నిజాంసాగర్, కామారెడ్డి ప్రాంతాలకు సాగునీటిని అందించాన్నారు. రూ. 40 వేల కోట్లతో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి తాగు నీరు సరఫరా చేసామన్నారు. విద్యుత్ ఉత్పాదనరంగంలో చేపట్టిన అన్ని ప్రాజెక్టులను అనుకున్న సమయానికి పూర్తి చేసామని అన్నారు. కేసీఆర్ ఆశించిన విధంగా తెలంగాణ రాష్ట్రంలో25 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని సాధించి మిగులు విద్యుత్ ఉత్పత్తి రాష్ట్రంగా మార్చాలనే సంకల్పంతో కృషిచేసామన్నారు. ఇవన్నీ ఆస్తులు సృష్టించినట్లే కదా అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, కొత్త ప్రాజెక్టుల రూపకల్పన వేగంగా జరిగిందన్నారు. గృహ, పారిశ్రామిక, వ్యవసాయ వినియోగదారులకు కరెంటు సమస్యలు ఉత్పన్నం కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా అనేక సమస్యలు ఉన్నప్పటికీ విద్యుత్‌ను కొనుగోలు చేసి సరఫరా చేశామన్నారు. కేసీఆర్ స్వీయ పర్యవేక్షణ వల్ల కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్, సింగరేణి జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్‌లు త్వరితగతిన పూర్తి చేసుకొని ఉత్పత్తి చేసుకోగలి గామని అన్నారు. రైతులకు కూడా 24గంటలు విద్యుత్ సరఫరా చేయాలన్న కేసీఆర్ ఏకైక లక్ష్యం నేరవేరిందన్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోన్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. వాస్తవ అభివృద్ధిని చూడాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడంతో కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టారని, దీని వల్ల రైతులు, అన్ని వర్గాల వినియోగదారులు సంతోషంగా ఉన్నారన్నారు.

# 5 లక్షల ఎకరాల్లో కొత్త ఆయకట్టును సృష్టిస్తాం



(మొదటి పేజీ తరువాయి) 2024 నాటికి 4.5 నుండి 5 లక్షల ఎకరాల్లో కొత్త ఆయకట్టులను సృష్టించడం మా లక్ష్యం” అని ఆయన నొక్కి చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీ కుప్పకూలిన ఘటనపై విజిలెన్స్ విచారణ ప్రారంభించిన విషయాన్ని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రస్తావించగా, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయ విచారణకు సిట్టింగ్ జడ్జిని నియమించాలని కోరుతూ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాసినట్టు చెప్పారు నీటి హక్కుల సమస్యను ప్రస్తావిస్తూ, తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతతో ఉందని అన్నారు. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి జాతీయ ప్రాజెక్టు హొదా కల్పించాలని కోరుతూ ఇటీవల ముఖ్యమంత్రితో కేంద్ర జల వనరుల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిశామని. జాతీయ ప్రాజెక్టు హొదా కోసం నిర్దిష్ట పథకం లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేసినా, నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని వివరించారు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద పాలమూరు రంగారెడ్డి నిధులు ఇస్తాని,” కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ హామీ మేరకు ప్రాజెక్టు నిధుల కోసం ఈ వారంలో భారత ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతామని ఆయన తెలిపారు. అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చారని మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు విమర్శించారు. అసలు ఈ ప్రాజెక్టు కాళేశ్వరం ఖర్చులో నాలుగో వంతుతో 16 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సృష్టించేదని అన్నారు. సాగు నీటి ప్రాజెక్టుల విషయంలో కేసీఆర్ చేసిన తప్పిదాలపై ఆయన విచారం వ్యక్తం చేస్తూ, తెలంగాణ ప్రజలు తరతరాలుగా దుష్పరిణామాలను చవిచూడాల్సి వస్తోందన్నారు. సరైన ఖర్చుతో త్వరితగతిన కొత్త ఆయకట్టులను సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డిపునరుద్ఘాటించారు. వేసవిలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నీటి చెరువులను పూడిక తీసి జంగిల్ క్లియర్ చేసే పనులు చేస్తామని ఆయన ప్రకటించారు. ప్రస్తుత నీటి కొరత దృష్ట్యా, రాబోయే తాగునీటి అవసరాలను తీర్చడానికి 10 టీఎంసీల కృష్ణా నీటిని కోరేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం కర్ణాటకలో పర్యటించనుందని ఆయన వివరించారు.

# బావిలోకి దూసుకెళ్లిన కారు.. ఒకరు మృతి

**పెద్దపల్లి,జనవరి13(సమసమాజం):** ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. ముగ్గురు క్షేమంగా బయట పడ్డారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం శివారులో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో నిమ్మనపల్లి నుంచి పెద్ద కల్వలకు వెళ్తున్న నెక్సా కారు అదుపుతప్పి వ్యవసాయ బావిలోకి దూసుకెళ్ళింది. ప్రమాదంలో రంగంపల్లికి చెందిన వినీత్ రెడ్డి అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న గాదె అఖిల్, అనురోహిత్ రెడ్డి, సాయిలు బావిలో నుంచి పైపు ద్వారా బయటికి వచ్చారు. సమాచారం అందుకున్న పెద్దపల్లి ఎస్ఐ మల్లేష్ ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ఒకే నెలలో ఆరు సార్లు ఢిల్లీకి సీఎం



(మొదటి పేజీ తరువాయి) సాక్షిగా చెప్పారని గుర్తు చేశారు. జలయజ్ఞం ఇందిరమ్మ ఇండ్ల అంశంలో అవినీతిని బయట పెడతామని కేసీఆర్ ప్రకటించారని అన్నారు. పదేళ్ల కేసీఆర్ పరిపాలనలో గత కాంగ్రెస్ పాలనపై ఎలాంటి విచారణ చేపట్టలేదని అన్నారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి వ్యవహారం కేసీఆర్ తరహాలోనే కనిపిస్తోందని కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి వచ్చాక కెసిఆర్ పాలనపై విచారణ చేపడతామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెల రోజులైనా ఎలాంటి విచారణకు ఆదేశించలేదన్నారు. ఒకే నెలలో సీఎం రేవంత్ రెడ్డి ఆరు సార్లు ఢిల్లీకి వెళ్ళారని, రాష్ట్ర పాలన మొత్తం ఢిల్లీ నుంచే కొనసాగుతోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ మ్ హౌస్ నుంచి పరిపాలన చేస్తే రేవంత్ ఢిల్లీ నుంచి పాలన కొనసాగిస్తున్నారు అంటూ మండిపడ్డారు. లక్షల్లో రేషన్ కార్డులను తొలగించాలానే ప్రయత్నాలు ఈ ప్రభుత్వంలో జరుగుతున్నా యన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణంలో బస్సులు రాక, బస్సులు లేక మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క రేషన్ కార్డ్ తొలిగించిన ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఉచిత ప్రయాణం హామికి ప్రభుత్వం దగ్గర స్పష్టమైన ప్రణాళిక లేదన్నారు. రాష్ట్రంలో 850 కి పైన గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు.. అధికారులు ఇలాంటి వాటి మీద దృష్టి పెట్టడం లేదని తెలిపారు. బస్సులు లేక గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, విద్యార్థినిలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 15000 కోట్ల అప్పు కోసం మొదటి నెలలోనే రేవంత్ ప్రభుత్వం పాకులాడిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చెపట్టడం లేదని మండిపడ్డారు. బీజేపీకి బీఆర్ఎస్ బీటీమ్ కాదని కేటీఆర్ చెబుతున్నారని, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే అనడానికి కేటీఆర్ మాటలే నిదర్శనమన్నారు. కేసీఆర్ బాటలోనే రేవంత్ నడుస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు.

# ఇండియా కూటమి చైర్మన్‌గా ఖర్గే



(మొదటి పేజీ తరువాయి) బెనర్జీ, ఉద్ధవ్ ఠాక్రే, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ హాజరు కాలేదు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఇండియా అలయన్స్ కన్వీనర్‌గా ఉండటానికి నిరాకరించారు. ఇండియా కూటమి కన్వీనర్ పదవిని చేపట్టానికి బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ నిరాకరించారు. కూటమి నేతల సమావేశంలో నితీష్ కుమార్ పేరును కాంగ్రెస్ నేతలు ప్రతిపాదించారు. అయితే ఆ పదవిపై తనకు ఆసక్తి లేదని, క్షేత్రస్థాయిలో ఇండియా కూటమిని బలోపేతం చేయడమే లక్ష్యమని ప్రకటించారు నితీష్‌కుమార్. కాంగ్రెస్ ఆ పదవిని చేపట్టాలని సూచించారు. వాస్తవానికి రాహుల్‌గాంధీ జనవరి 14 నుంచి చేపట్టబోయే భారత్ జోడో న్యాయ్‌యాత్రకు హాజరుకావాలని మిత్రపక్షాలను ఆహ్వానించేందుకే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ భారత్ జోడో న్యాయ్ యాత్రపై కూడా సమావేశంలో చర్చించారు. మణిపూర్‌లో జనవరి 14 నుంచి ప్రారంభమయ్యే భారత్ జోడో న్యాయ్ యాత్రలో కూటమి పార్టీల భాగస్వామ్యంపై కూడా సమావేశంలో చర్చిస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ అంతకుముందు ట్వీట్ చేశారు.అలాగే, కూటమి సమన్వయకర్తను చేయడం, సీట్ల పంపకం సహా పలు అంశాలపై చర్చించేందుకు భారత కూటమి సమావేశాన్ని పిలిచారు. విపక్ష కూటమి నేతలు కూడా ఈ అంశాలపై చర్చించారు. ఈ సమయంలో నితీష్ సమన్వయకర్తగా ఉండటానికి నిరాకరించారు. ఈ సమావేశానికి మమతా బెనర్జీ హాజరుకాలేదు. సభకు సంబంధించిన సమాచారం ఆలస్యంగా వచ్చిందని, ఇప్పటికే చాలా కార్యక్రమాలు పెట్టుకున్నారని టీఎంసీ పార్టీ వర్గాలు తెలిపాయి. అటువంటి పరిస్థితిలో, ఆమె ప్రతిపక్ష కూటమి సమావేశానికి హాజరుకాదు. ఇది కాకుండా, మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే కూడా వర్చువల్ మీటింగ్‌లో చేరలేదు.

# కృష్ణా జిల్లాలోనూ పందాల జోరు



**విజయవాడ,జనవరి13(సమసమాజం):** సంక్రాంతి పండుగ సందర్భంగా కృష్ణా జిల్లాలో కోడి పందేలు జోరుగా సాగనున్నాయి. గతేడాది లాగే ఈ యేడు కూడా పందాలకు సిద్ధం అవుతున్నారు. గుడివాడ, పామర్రు నియోజకవర్గాల్లో పెద్దయెత్తున పందేలు నిర్వహిస్తున్నారు. స్థానిక నేతలే పందాలను ప్రోత్సహిస్తున్నారని సమాచారం. గుడ్లవల్లేరు, కొమరవోలు, మువ్వ మండలాల్లో కోడిపందేలు ఏటా జోరుగా కొనసాగుతాయి. అలాగే విజయవాడ తూర్పు, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో జోరుగా కోడిపందేలు జరగుతాయి. దీంతో ఎక్కడ చూసినా జనసందోహమే కనబడుతోంది. కోడి పందేలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. దీంతో ఆ గ్రామాల్లో ఎటుచూసినా పండుగ వాతావరణమే కనిపిస్తోంది.

# విజయవాడ హైవేపై భారీ రద్దీ



(మొదటి పేజీ తరువాయి) ఖాళీ అవుతుంటే.. పండక్కి గ్రామాలకు వెళ్లేవారితో టోల్ ప్లాజాల వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై అర్ధరాత్రివరకు వాహనాల జాతర నెలకొంది. సంకాంత్రి సెలవులు రావడంతో.. హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు ప్రయాణికులందరూ ఒకేసారి తరలివెళ్తున్నారు. రాజధాని నుంచి వచ్చే వాహనాలు యాదాద్రి భువనగిరిజిల్లా పంతంగి టోల్‌ప్లాజావద్ద బారులు తీరుతున్నాయి. ఖమ్మం, భద్రాది, నల్గొండ, గుంటూరు, ప్రకాశం, విజయవాడ, విజయనగరం, శ్రీకాకుళం వైపు వేళ్లే వాహనాలన్నీ ఈ టోల్ ప్లాజా మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. సాధారణ రోజుల్లో విజయవాడ వైపు వేల సంఖ్యలో వాహనాలు వెళుతాయి. వీటిలో కార్లు అధికంగా ఉన్నాయి. వాహనచోదకులు టోల్ చెల్లించడానికి సుమారు అరగంటసేపు వేచిచూడాల్సి వచ్చింది. పోలీసులు జోక్యం చేసుకొని టోల్ చెల్లింపు కేంద్రాలను ఎక్కువగా తెరిపించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. పండక్కి రెండు రోజుల ముందే సొంతూళ్లకు పయనమవడంతో రహదారులపై వాహనాల రద్దీ పెరిగింది. మరీ ముఖ్యంగా.. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సంక్రాంతి రద్దీ కొనసాగుతోంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దాల్సి వచ్చింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ఉదయం నుంచే తీవ్రంగా ట్రాఫిక్ రద్దీ నెలకొంది. పెద్దసంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగుతుండటంతో ప్రజలు రోడ్డు దాటేందుకు సైతం ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద వాహనాలు బారులుతీరాయి. టీఎస్ ఆర్టీసీ సంక్రాంతికి అదనపు వడ్డన లేకుండా సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులు నడుపుతుండడంతో ఎక్కువ మంది ఆ బస్సుల్లోనే వెళ్లేందుకు మొగ్గుచూపుతున్నారు. మహిళలకు ఫ్రీ కావడంతో రద్దీ పెరిగింది. ఏపీఎస్ ఆర్టీసీ నడుపుతున్న ప్రత్యేకబస్సుల్లో 50శాతం అధిక చార్జీ వసూలు చేస్తుండడంతో ఏపీవాసులు సైతం హైదరాబాద్ నుంచి సొంతూరికి వెళ్లడానికి టీఎస్ ఆర్టీసీ బస్సులకే ప్రాధాన్యమిస్తున్నారు.గడిచిననాలుగు రోజుల్లో టీఎస్ ఆర్టీసీ ఏపీ, తెలంగాణల్లోని పలు జిల్లాలకు 2,700కు పైగా ప్రత్యేక సర్వీసులను నడిపింది. రద్దీ పెరిగితే మరిన్ని అదనపు బస్సులు నడుపుతామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇక.. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఎంజీబీఎస్‌లో ప్రయాణికుల రద్దీ తీరును, ప్రత్యేక బస్సులను టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సూచనలు, సలహాలు స్వీకరించారు.

# నాలుగో సారి కేజ్రీవాల్‌కు ఈడీ నోటీసులు

## లిక్కర్ స్కామ్ కేసులో కీలక మలుపు






**న్యూఢిల్లీ,జనవరి13(సమసమాజం):** ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ (ఈడీ) మరోసారి విచారణకు హాజరు కావలని నాల్గవ సారి నోటీసులు జారీ చేసింది. లిక్కర్ స్కామ్ కేసులో మనీలాండరింగ్‌కు సంబంధించి ఈ నెల 18 న హాజరు కావాలని ఈడీ పేర్కొంది. గతంలో కేజ్రీవాల్ విచారణకు హాజరవ్వాలని ఈడీ మూడు సార్లు సమన్లు జారీ చేసింది. అయితే కేజ్రీవాల్ మాత్రం విచారణకు ఒక్కసారి కూడా హాజరుకాలేదు. తాజాగా జనవరి 3న మరోసారి ఈడీ సమన్లు జారీ చేసింది. తనకు ఈడీ సమన్లు జారీ చేయడంపై కేజ్రీవాల్ స్పందించారు. ఈడీ జారీ చేసిన సమన్లు చట్టవిరుద్ధమైనవి అని ఆరోపించారు. రాజకీయ కక్షతోనే సమన్లు జారీ చేశారని విమర్శించారు. జారీ చేసిన సమన్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నుంచి తనను దూరం చేయ్యడానికే ఈడీ సమన్లు జారీ చేసిందని విమర్శించారు.

# 4% పెరిగిన చమురు ధరలు

**న్యూఢిల్లీ,జనవరి13(సమసమాజం):** పశ్చిమదేశాలు, హౌతీ రెబెల్స్ దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఎర్ర సముద్రంలో వాణిజ్యనౌకలను హౌతీలు లక్ష్యంగా చేసుకుంటున్న నేపథ్యంలో చమురు సహా అన్ని సరుకుల రవాణాకు తీవ్ర విఘాతం కలిగింది. హౌతీలను నిలువరించే లక్ష్యంతో అమెరికా, బ్రిటన్ యెమెన్‌లో వారి స్థావరాలపై ప్రతి దాడులు చేశాయి. పశ్చిమదేశాల సైనిక చర్యకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ మద్దతు ఉన్న హౌతీలు హూంకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ఏడాదిలో తొలిసారిగా చమురు ధరలు 4% పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్ 80.71 డాలర్లకు చేరింది. మున్ముందు ఇవి ఇంకా పెరిగే అవకాశాలున్నాయి. ముడి చమురు బ్యారెల్‌కు 10 డాలర్లు, సహజవాయువు ధర 25% మేర పెరగొచ్చని చమురు రంగ నిపుణులు అనుమానిస్తున్నారు. అమెరికా వెస్ట్ టెక్సాస్ క్రూడ్ ధర 2.79 శాతం పెరిగి బ్యారెల్ 74.03 డాలర్లకు చేరింది. ద్రవ్యోల్బణం ఇటీవల తగ్గుముఖం పడుతుండటంతో పలు దేశాలు ఊపిరి తీసుకుంటున్నాయి. ఈ దశలో చమురు ధరల పెరుగుదలతో ఆర్థిక పరిస్థితి మరింత దిగజారవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. క్రూడాయిల్ ధరలు పెరిగితే ఆ ప్రభావం అంతటా ఉంటుంది. ఎర్రసముద్రం ద్వారా వర్తక, వాణిజ్యం ఎంతో కీలకం. సముద్ర వాణిజ్యంలో 30 శాతం ఈ మార్గం గుండానే జరుగుతోంది. ఎర్రసముద్రం మీదుగా 14 ట్రిలియన్ డాలర్ల విలువైన సరుకు రవాణా సాగుతోంది. పశ్చిమాసియా, యూరప్ మధ్య వర్తక, వాణిజ్యానికి అతి దగ్గర సముద్ర మార్గం ఇదే. ఇంగ్లిష్ చానెల్, పనామా కాల్వ తర్వాత అత్యంత బిజీగా ఉండే రూట్ కూడా ఇదే. 2021లో సూయిజ్ కెనాల్ మూతపడినప్పుడు అంతర్జాతీయంగా 9.6 బిలియన్ డాలర్ల విలువైన సరుకు రవాణా నిలిచిపోయింది. ఇప్పుడు ఎర్రసముద్రంలో అలజడుల కారణంగా నౌకలు తమ మార్గాన్ని మళ్లించుకుంటున్నాయి. ఎర్రసముద్రం దక్షిణాన ఉన్న బాబ్ అల్-మండేబ్ జలసంధి గుండా రవాణాను నిలిపివేస్తున్నట్టు డానిష్ ఆయిల్ ట్యాంకర్ గ్రూప్ టార్మ్ ప్రకటించింది. మదరా సిల్వర్, హాఫీనియా థేమ్స్, ఫ్రీ స్పిరిట్, ఫ్రంట్ ఫ్యూజన్, గమ్సనోరో తదితర ఆయిల్ ట్యాంకర్లు కూడా మార్గాన్ని మళ్లించుకోవడమో, రవాణాను నిలిపివేయడమో చేశాయి. దూరాభారం కారణంగా సరుకుల ధరలు పెరుగుతాయి. దీనికి చమురు ధరల పెరుగుదల తోడు అయితే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

# రాజ్‌భవన్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

## రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్



**హైదరాబాద్,జనవరి13(సమసమాజం):** తెలంగాణ రాజ్‌భవన్‌లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. గవర్నర్ తమిళసై రాజ్?భవన్ ఉద్యోగులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. రంగవల్లులు వేసి, చెరుకు గడలను ఏర్పాటు చేసి అందులో పొంగల్ తయారు చేశారు. రకరకాల పూలతో ఇంటిని అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసిననంతరం తెలంగాణ ప్రజలకు సంక్రాంతి, పొంగల్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని కాంక్షించారు. ఈ సారి సంక్రాంతి వేడుకలు పూర్తైన వారం రోజులకు అయోధ్యలోని శ్రీరాముని మందిరం ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందన్నారు. అందుకే ఈ ఏడాది సంక్రాంతి ప్రత్యేకం అన్నారు. త్వరలో రామ్ మందిర్?కి సంబంధించిన తెలుగు, హిందీ పాటలను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా తన ఢిల్లీ పర్యటన గురించి కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. సంక్రాంతి పండుగ వేడుకల నేపథ్యంలో ఢిల్లీ వెళున్నానన్నారు. ఇది రాజకీయ పరమైన పర్యటన కాదని స్పష్టం చేశారు. దీనికి కారణం గతంలో ఆమె ఢిల్లీ పర్యటించినప్పుడు లోక్ సభ ఎన్నికల్లో ఎంపీగా తమిళనాడు నుంచి పోటీ చేయనున్నట్లు వచ్చాయి. వాటన్నింటినీ తమిళి సై కొట్టిపరేశారు. అవన్నీ ఉత్తి వదంతులే అని వివరించారు. అలాంటివి ఏవైనా ఉంటే ముందుగానే తెలియజేస్తానన్నారు.

# మొండితనంతో దేన్నీ సాధించలేం

సామరస్యపూర్వంగా సమస్యను పరిష్కరించుకోండి ● అధికారిణిలకు సుప్రీం కోర్టు సూచన ● రోహిణి సింధూరి, రూపల కేసులో కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్,జనవరి13(సమసమాజం):** ఇద్దరూ ఉన్నతమైన ఉద్యోగాలు చేస్తున్నారు. మున్ముందు ప్రభావంతమైన భవిష్యత్ ఉంది. సామరస్యపూర్వంగా సమస్యను పరిష్కరించుకోండి. మొండితనంతో దేన్నీ సాధించలేం. పరిస్థితిని అర్థం చేసుకుని మీ వివాదానికి నెలలో ముగింపు పలకండి" అని %×ూా% రోహిణి సింధూరి, %×ూా% డి. రూపలకు సూచించింది సర్వోన్నత న్యాయస్థానం. ఉన్నత స్థానంలో ఉండి.. ఇలా గొడవలు పడి.. ఒకరినొకరు కించపరుచుకుంటూ.. సభ్య సమాజానికి ఏం మెసేజ్ ఇస్తున్నారని న్యాయమూర్తి ఇరువురిని ప్రశ్నించారు. ఇలా బహిరంగ ఆరోపణల వల్ల ఎలా ఉపయోగం ఉండదన్నారు. అయితే రోహిణి సింధూరి మాత్రం పట్ట వీడలేదు. సోషల్ మీడియాలో తనను కించపరుస్తూ పెట్టిన పోస్టులు తొలగిస్తే సరిపోదన్నారు. తనను ఇబ్బంది పెట్టిందనందుకు సారీ చెప్పాల్సిందే అని పట్టుబట్టారు. దీంతో కేసు విచారణను మార్చి 15కు వాయిదా వేశారు న్యాయమూర్తి జస్టిస్ ఓకా. కన్నడనాట ఈ ఇద్దరు మహిళా సివిల్ సర్వీస్ అధికారులు మధ్య అప్పట్లో మాటల యుద్ధం నడిచింది. ఐఏఎస్ రోహిణి సింధూరికి వ్యతిరేకంగా ఐపీఎస్ డి. రూపా ముద్గిల్ ఫేస్‌బుక్‌లో తీవ్ర విమర్శలతో పలు పోస్ట్‌లు చేశారు. రోహిణి సింధూరి వ్యక్తిగత ఫొటోలను పోస్ట్ చేసి ఆమె పాల్పడుతున్న అక్రమాలు ఇవీ అని పలు ఆరోపణలను గుప్పించారు. రోహిణిపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోషల్ మీడియా వేదికగా ఇద్దరు ఉన్నతాధికారులు పరస్పర ఆరోపణలు చేసుకోవడంతో ఇష్యూ హాట్‌టాపిక్ అయ్యింది. ఐపీఎస్ రూపా ముద్గల్ తన పోటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంపై ఐఏఎస్ రోహిణి సింధూరి మండిపడ్డారు. దీనిపై న్యాయపోరాటం చేస్తానన్నారు. ఫొటోలను బయటపెట్టడం, నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా రూపా తనపై దుష్ప్రచారం సాగిస్తోందని ఆమె ధ్వజమెత్తారు. రూపా ముద్గల్ మతి స్థిమితం కోల్పోయిందని రోహిణి మండిపడ్డారు. రూపా ఎప్పుడూ వార్తల్లో ఉండాలనే తపనతో ఈ విధంగా వ్యవహరిస్తోందన్నారు. ఆమె మానసిక రోగానికి చికిత్స తీసుకోవాలని సెటైర్ వేశారు రోహిణి. దీంతో పాటు కోర్టును ఆశ్రయించారు.



Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU,***
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in